క్లుప్తంగా

ఇస్మాయిల్‌స్వామి ఉత్సవ పీరుకు విరాళాలు

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచర్ల గ్రామంలో జరిగిన ఇస్మాయిల్‌స్వామి ఉత్సవ పీరుకు భారీగా విరాళాలు వచ్చినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఇస్మాయిల్ పీరుకు రూ.2,36,210 విలువ బంగారు చైన్, బంగారు డాలర్, రూ.41వేలు విలువ చేసే బుట్ట కమ్మలు, 116 వెండి గొడుగులు, ఒక వెండి ఊయల వచ్చినట్లు తెలిపారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న ధర్నా



ఆర్టీపీపీలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల : డిమాండ్ల సాధన కోసం ఆర్టీపీపీలో ధర్నా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆర్టీపీపీ గేటు బయట జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధంగా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన



ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటసుబ్బయ్య

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట పొలాల్లో పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలనే అంశంపై రైతు భరోసా సిబ్బందికి అవగాహన కల్పించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకుడు వి.వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం కొండాపురం రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో ప్రభుత్వం నిర్ణయించిన పంటలపై పంట కోత ప్రయోగాలు జరపాలన్నారు. వాటి దిగుబడులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వ్యవసాయాధికారి రామాంజులరెడ్డి మాట్లాడుతూ డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పంటలకు పిచికారీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమేష్, ఆర్‌బీకే సిబ్బంది కన్నా, సురేష్, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం



కవల పిల్లలకు బహుమతులిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఆర్టీపీపీలోని డీఏవీ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న 16 మంది జంట కవలలను వేదికపైకి పిలిచి వారికి బహుమతులిచ్చి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ బ్రహ్మదేవర శ్రీనివాసులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి కె.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని రవీంద్రనగర్‌లోని ఉర్దూ అకాడమి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉర్దూ అకాడమి డైరెక్టర్ అయూబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్ అయిన ముస్లిం మైనారిటీలు సెంటర్ ఇంచార్జ్ అబ్దుల్ జహీర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9985210282 నెంబర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలో ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ శనివారం కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరాహారదీక్ష నిర్వహించింది. ఫెడరేషన్ నాయకులు వెంకటసుబ్బయ్య, రవి ప్రకాష్‌లు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలలో వ్యత్యాసం ఉండరాదన్నారు. ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14వ తేదీ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చంద్రారెడ్డి, సుదర్శన్, ఏసన్న, సురేష్, రఘుశంకర్‌రావు, రాజరత్నం తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నూరు : ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ తమ పరిధిలో సహాయ సహకారాలు అందించే ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని.. అలాంటి వారిలో ప్రజలకు సేవ చేసే గుణం ఉంటుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణంలో చెన్నూరు సహకార సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన అల్లీ శ్రీరామ్మూర్తి చెన్నూరు రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయ చైర్మన్‌గా తన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. అలాంటి వ్యక్తికి చెన్నూరు సహకార సొసైటీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత కల్పించి వారి సంక్షేమానికి అనేక పథకాలు తీసుకువచ్చారన్నారు. అలాగే ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సహకార సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సహకార సొసైటీ అధ్యక్షుడుగా నియమించినందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన అల్లి శ్రీరామ్మూర్తి, డైరెక్టర్లుగా ఉప్పరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన గాజులపల్లె సంపూర్ణరెడ్డి, కొండపేటకు చెందిన గంగులయ్యలచేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్‌ఆర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, జయభారత్‌రెడ్డి, అటవీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీలక్ష్మీ, జేసీఎస్ కన్వీనర్లు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఆర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతర పంటలతో మంచి ఆదాయం



అంతర పంటల సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న డీపీఎం రామకృష్ణరాజు

వేముల : నవధాన్యాలు, అంతర పంటలు సాగు చేసుకోవడంవల్ల మంచి ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు పేర్కొన్నారు. శనివారం వేముల మండలం గొందిపల్లె, వేముల గ్రామాల్లో ఫార్మర్ సైంటిస్ట్ శైలజ, ఐసీఆర్పీ సునీతలతో కలిసి ఆయన అంతర పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధ్యానాలు, కూరగాయలు ఇలా 15 రకాల అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా ఒక పంటకు ఆదాయం రాకపోయినా, ఇంకొక పంట ద్వారా ప్రధాన పంట కంటే ఇతర అంతర పంటల ద్వారా మంచి దిగుబడితో పాటు ఆదాయం వస్తుందన్నారు. రైతులందరూ రసాయనాలు తగ్గించి నవధ్యానాలు, అంతర పంటలు సాగు చేసుకోవడం వల్ల భూమిలో కార్బన్ శాతం పెరిగి భూమి గుళ్లబారి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఎన్‌ఎఫ్‌ఏ చందురెడ్డి, నరసింహారెడ్డి, మెంటర్ ఉమాదేవి, యూనిట్ ఇన్‌చార్జిలు రామ్మోహన్ నాయుడు, వెంకటేష్, అంజన్‌రెడ్డి, ఐసీఆర్పీలు, ఐబీ ఐసీఆర్పీలు, రైతులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ, సిబ్బంది

వేంపల్లె : ఏడాది పాటు పలు పంటల సాగుపై వ్యవసాయాధికారి రాజేంద్ర ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని ముతుకూరు గ్రామంలో మెంటార్ బాబు తన సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పండించిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటీఎం విధానం ద్వారా పలు పంటలు సాగుచేయడం వల్ల 365 రోజులు ఆదాయంతోపాటు అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు ఉత్పత్తి అవుతాయన్నారు. వీటిని తినడంవల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే బీజామృతం, విత్తన శుద్ధి, విత్తనాలు నాటడం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ కిశోర్ నాయక్, మాస్టర్ ట్రైనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లోక్‌రాజు, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా అలవలపాటి రమాదేవి



ఇన్‌చార్జి ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపడుతున్న అలవలపాటి రమాదేవి

లింగాల : లింగాల మండల ఇన్‌చార్జి ఎంపీపీగా అలవలపాటి రమాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీపీగా ఉన్న ఎం.అమృత గతనెల 31వ తేదీన అనివార్య కారణాలవల్ల రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి ఎంపీపీగా అలవలపాటి రమాదేవి పదవీ బాధ్యతలు చేపట్టారని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. 1994 యాక్ట్ ప్రకారం ఎన్నికల కమిషన్ నుంచి తిరిగి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు రమాదేవి ఇన్‌చార్జి ఎంపీపీగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ తనకు ఇన్‌చార్జి ఎంపీపీ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల వాటాను త్వరగా కట్టించాలి



మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య

పులివెందుల రూరల్ : జగనన్న హౌసింగ్ కాలనీలోని ఇళ్ల లబ్ధిదారుల రూ.35వేల వాటాను త్వరగా కట్టించాలని మెప్మా అధికారి గంగులయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక మెప్మా కార్యాలయంలో ఆర్పీలు, కిందిస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సిటిజెన్స్ ఫీడ్ బ్యాక్ ప్రతి సంఘ సభ్యులతో చేయించాలన్నారు. అలాగే ఆర్పీలు, కిందిస్థాయి సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి ఆర్పీ ఆదిత్య బిర్లా కంపెనీలో పనిచేసేందుకు 18ఏళ్ల నుండి 32 ఏళ్లలోపు కలిగిన ముగ్గురు మహిళలను గుర్తించాలన్నారు. సమావేశంలో ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధి కిరణ్, సీసీలు నాయుడు, నాగన్న, హరిత, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి నులిపురుగుల నివారణ మందులను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ



కళాశాల ప్రిన్సిపల్‌కు అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

ఎర్రగుంట్ల : ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఎర్రగుంట్ల మండలం చిలంకూరులోని పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో, అలాగే 6 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా నులిపురుగుల నివారణ మాత్రలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, కమిషనర్ పి.జగన్నాథ్ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, వైద్యులు జ్యోత్స్న, డాక్టర్ నాగార్జున, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, సూపర్‌వైజర్లు ఓబులేసు, వరదమ్మ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

లింగాల : నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, పాఠశాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుభాషిణి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో లింగాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డికి ఎంపీడీఓ సురేంద్రనాథ్, సీహెచ్ఓ శివరాంలు అల్బెండజోల్ మాత్రలను అందించారు.

నేడు పులివెందులకు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కి ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్, చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య, కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుడు డాక్టర్ హితేష్‌రెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత రోగులను పరీక్షించి వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు సంఘ సేవకులకు సన్మానం

కడప రూరల్ : నూర్‌బాష్ దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో సంఘ సేవకులకు సన్మాన కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రసూల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కడప, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, అనంతపురం జిల్లాల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజక వర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మేయప్పన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రతి గ్రామానికి తాగునీటిని అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగు నీటి సాధన కోసం ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 15 వరకు నియోజక వర్గాలలో సదస్సు, ప్రచార జాతాలు, 30, 31న బస్సుయాత్ర చేపట్టి సెప్టెంబరు 16న కడప నగరంలో జరిగే మహా సభలను జయప్రదం చేయాలన్నారు.

విభజన హామీల కోసం ఉద్యమిద్దాం

కడప రూరల్: రాష్ట్ర విభజన హామీల కోసం ఉద్యమిద్దాం అని ఆర్‌వైఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కొరాణి షిబు, రాజీవ్ బెనర్జీ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన హామీల అమలుతో రాష్ట్ర మరింతగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందన్నారు. యువత విభజన హామీల కోసం ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా నేరెళ్ల కళ్యాణ్, కో కన్వీనర్‌లుగా సుబ్బరాయుడు, నరసింహప్రసాద్, వెంకటేష్, లోకేష్‌లను నియమించారు.

కడప ఒన్‌టౌన్‌లో వ్యక్తి హల్‌చల్

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోకి చొరబడి స్వరాజ్‌కుమార్ అనే వ్యక్తి హల్‌చల్ చేశాడు. తానే రాయితో తలపై కొట్టుకుని, స్టేషన్ ఆవరణలోని బండలను పగులగొట్టాడు. శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్వరాజ్ కుమార్ తాను 2021లో బంధువులపై ఫిర్యాదు చేశానని, ఆ కేసు ఏమైందని వచ్చి హల్‌చల్ చేశాడు. ఈక్రమంలోనే ఓ కానిస్టేబుల్‌కు సంబంధించిన హెల్మెట్‌ను తీసుకుని అతనిపైనే దాడి చేశాడు. మరోవైపు విధుల్లో వున్న మహిళా కానిస్టేబుల్ పట్ల పరుషపదజాలంతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ, వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : గడువులోగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో జగనన్న మెగా లే అవుట్ ఇళ్ల నిర్మాణ పనులను పాడా ఓఎస్డీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులు, యూజీడీ, నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిని తనిఖీ చేశారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం ఇచ్చిన గడువులోగా కాలనీలలో జరుగుతున్న అన్ని నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సురేంద్ర బాబు, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులను పరిశీలించిన వైఎస్ మనోహర్‌రెడ్డి



ఆక్రమణ నిర్మాణాలను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని గుంత బజార్, ఇస్లాంపురం ప్రాంతాలలో జరుగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంకను ఆక్రమించి నిర్మిస్తున్న నిర్మాణాలను ఆయన ఆపు చేయించి ఇప్పటికే జరిగిన ఆక్రమణ నిర్మాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అలా చేసినప్పుడే మండలం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అలా కాకుండా వారిని తిప్పుకుంటూ కాలయాపన చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని వెంటనే చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఏఈకి సూచించారు. నూతనంగా నిర్మించిన అన్ని సచివాలయాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పంచాయతీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఏఈ మల్లారెడ్డితో అన్నారు. తలపనూరు సర్పంచ్ శివమారుతిరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా ఉపాధి హామీ పనులు చేపట్టలేదని దీనిపై ఏపీఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీపీ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టే సమయంలో సర్పంచులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్మశానం ఆక్రమణపై వైఎస్సార్‌సీపీ నేత నిరసన



వల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో కింద కూర్చుని నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేత

వల్లూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ స్మశానాన్ని కొందరు ఆక్రమించారని పలు మార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదంటూ వైఎస్సార్‌సీపీ నేత విశ్వనాథరెడ్డి వల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శంకర్ రావు ఎదుట శనివారం కింద కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామ ప్రజలు శ్మశానంగా ఉపయోగిస్తున్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆక్రమణల నుంచి శ్మశానాన్ని కాపాడాలని కోరుతూ గత సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు సర్వేయర్ గ్రామానికి వచ్చి కొలతలు వేసి ఆక్రమణ జరిగినట్లు ధ్రువీకరించారని తెలిపారు. అయితే వీఆర్‌ఓ పోతులూరయ్య వీఆర్‌ఏలతో కలిసి శనివారం గ్రామంలోకి వచ్చి కేవలం ఆక్రమణదారులతోనే అభిప్రాయ సేకరణ జరిపి వారికి సహకరించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ శంకర్‌రావు వివరణ ఇస్తూ విశ్వనాథరెడ్డి ఇచ్చిన స్పందన ఫిర్యాదు మేరకు సర్వేయర్‌చే కొలతలు వేయించామన్నారు. ఎకరాకు పైగా అంబవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని వంక పోరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించినట్లు గుర్తించారని తెలిపారు. కాగా మంగళవారం తానే స్వయంగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హుస్సేన్

పెద్దముడియం : తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, వీటిని తాగిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని మేడిదిన్నె పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ హుస్సేన్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మేడిదిన్నె పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి బిడ్డకు జన్మ ఇచ్చిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి, వెంకటరమణ, ఆరోగ్య, ఆశా, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఆరోగ్య టీకా

సింహాద్రిపురం : పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఆరోగ్య టీకా అని డాక్టర్లు హుస్సేన్, కుమార్‌లు పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ప్రకృతి సిద్ధమైన వ్యాధి నిరోధక టీకా లాంటిది తల్లి పాలు అన్నారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు వసంతకుమారి, హైమావతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై రాళ్ల దాడి అమానుషం



మాట్లాడుతున్న వైఎస్సార్ వయోజన విద్య ఉద్యోగుల సంఘం నాయకులు

పులివెందుల టౌన్ : పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన ఘర్షణలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై రాళ్ల దాడి చేయడం అమానుషమని వైఎస్సార్ వయోజన విద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చల్లా ప్రసాద్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనునిత్యం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు రక్షణగా నిలుస్తున్న పోలీసులను దుర్భాషలాడటం, అవమానపరచడం, వారిపై దాడి చేయడం ఆందోళనకర విషయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ వయోజన విద్య ఉద్యోగుల సంఘం నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో శనివారం ఎంపీపీ ఎం. వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం వస్తోంది, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.